ప్రజాశక్తి
బుధవారం 30 ఏప్రిల్ 2025
5
అల్లూరి సీతారామరాజు



పిజిఆర్ఎస్ పరిష్కార చర్యలకు 1100 టోల్‌ఫ్రీ నెంబరు

ప్రజాశక్తి- పాడేరు : ప్రతి శుక్రవారం పాడేరులో, ప్రతి సోమవారం రంపచోడవరంలో ప్రతి బుధవారం చింతూరు ఐటిడిఎల్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) అర్జీల పరిష్కార చర్యలపై 1100 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి తెలుసుకోవచ్చని జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రాల్లో ప్రతిసోమవారం నిర్వహించే పిజిఆర్ఎస్‌లో స్వీకరించి అర్జీలను తక్షణమే ఆన్‌లైన్‌లో నమోదు చేసి పరిష్కార చర్యలు చేపట్టాలని ఎంపిడిఒ, తహాశీల్దార్లను ఆదేశించారు. గ్రీవెన్స్‌లో స్వీకరించిన ఫిర్యాదులపై పరిష్కార చర్యలను ఎప్పటికప్పుడు దరఖాస్తుదారులకు తెలియజేయాలని సూచించారు. 1100 టోల్ ఫ్రీ సేవలను ఫిర్యాదుదారులు వినయోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.

ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌సి సాధనకు

మన్యం బంద్‌ను జయప్రదం చేయండి

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు
- 2న రాష్ట్రబంద్‌కు సిపిఎం, ప్రజాసంఘాల మద్దతు
- ఏజెన్సీలో పలుచోట్ల సన్నాహక సమావేశాలు
- జిఒ3 ప్రయోజనాల పునరుద్ధరణకుప్రత్యేక ఆర్డినెన్స్; సిఎం చంద్రబాబు ఇచ్చిన హామీ అమలుకు డిమాండ్

ప్రజాశక్తి – అరకులోయ: ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు జిఒ 3 ప్రయోజనాలను పునరుద్ధరించి, ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి ప్రకటనతో ఏజెన్సీలోని వందశాతం పోస్టులను స్థానిక గిరిజనులతో భర్తీ చేయాలని రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌సి సాధనకు మే 2 నుంచి నిర్వహించే రాష్ట్రవ్యాప్త మన్యం బంద్‌ను జయప్రదంచేయాలని పిలుపునిచ్చారు.

మంగళవారం స్థానిక ఉద్యోగుల సంఘం భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు వంతల అరుణ్ కుమార్ మాట్లాడుతూ, ఈనెల 20న సిఎం చంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన మెగా డిఎస్‌సిలో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. 5వ షెడ్యూల్ ఏరియాలో 100 శాతం రిజర్వేషన్ల అమలుపై స్పష్టత లేకుండా డిఎస్‌సి నోటిఫికేషన్ జారీతో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయడం వల్ల నిరుద్యోగ ఆదివాసీ యువతకు తీవ్రంగా నష్టపోతారన్నారు. అల్లూరి జిల్లాకు సంబంధించి మెగా డిఎస్‌సిలో ప్రకటించిన 400 పోస్టులకు గాను, ఎస్‌టిలకు ఆరు శాతం రిజర్వేషన్ కింద కేవలం 24 పోస్టులు మాత్రమే కేటాయించారన్నారు. మిగిలిన 94శాతం పోస్టులను గిరిజనేతరుల పరం కానున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీప్రాంతంలో గిరిజనులకు నూరు శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ రిజర్వేషన్ కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ జారీచేసి, ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. మెగా డిఎస్‌సిలోని ఏజెన్సీ ప్రాంత ఉపాధ్యాయ పోస్టులను మినహాయించి, వాటిని ప్రత్యేక డిఎస్‌సి ద్వారా భర్తీ చేయాలన్నారు.

కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పుడిని దేముడు, పివిటిజిలు జిల్లా నాయకులు ప్రకాష్ ఆదివాసీ పరిరక్షణ సమితి అధ్యక్షుడు చట్టు మోహన్, మాతృభాష ఉపాధ్యాయుల సంఘం నాయకులు రమేష్, నాగేంద్ర ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు జగన్నాథం, రామారావు గిరిజన విద్యార్థి సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు పోతురాజు, డివైఎఫ్‌ఐ నాయకులు ప్రసన్న పెసా కమిటీ సభ్యులు ఎం రమేష్, జన్ని సురేష్ ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌సి సాధన కమిటీ ప్రతినిధులు రమేష్, సతీష్, కుమార్, రాజు పాల్గొన్నారు.

సీలేరు : గిరిజన ప్రత్యేక డిఎస్‌సి ప్రకటన కోసం ఆర్డినెన్స్ తీసుకురావాలని సిపిఎం గాలికొండ ఎంపిటిసి అంపురంగి బుజ్జిబాబు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ మే 2న తలపెట్టిన మన్యం బంద్‌కు సిపిఎం జికె వీధి మండల కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని బుజ్జిబాబు చెప్పారు. ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రకటించి గిరిజనులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. మే 2న గిరిజన సంఘాలు తలపెట్టిన మన్యం బంద్‌కి రాజకీయాలకు అతీతంగా పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న బాలదేవ్

ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌సి సాధనకు ఆమరణ దీక్ష




ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న సురేష్

పాడేరు టౌన్: ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వాలని వైఎస్ఆర్, టిఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు టి.సురేష్ కోరారు. మెగా డిఎస్‌సితో గిరిజన నిరుద్యోగులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ఈ మేరకు మంగళవారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ఐటిడిఎ గేటు ఎదుట ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ మెగా డిఎస్‌సి నోటిఫికేషన్‌లో షెడ్యూల్డ్ ఏరియాలోని పోస్టులను మినహాయించి, వాటిని ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి ద్వారా భర్తీ చేయాలన్నారు. జిఒ3కు ప్రత్యామ్నాయంగా ఆదివాసీ గిరిజనులకు శతశాతం ఉద్యోగ రిజర్వేషన్లు అమలు జరిగేలా తక్షణం ఆర్డినెన్స్, తర్వాత ప్రత్యేక చట్టం చేయాలన్నారు. జిఒ3పై ఎన్నికల సభలో ప్రతిపక్షనేతగా అప్పట్లో ఇచ్చిన హామీని సిఎం చంద్రబాబు అమలు చేయాలని కోరారు.

కొయ్యూరు : పాడేరు ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖలో 400 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేగా, వాటిలో 24 పోస్టులు మాత్రమే ఆదివాసీలకు కేటాయించారని, ఈ అన్యాయంపై మే2న జరుగు బంద్‌ను జయప్రదం చేయాలని అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు మంగళవారం వారు విలేకర్లతో మాట్లాడారు. కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు గిరిజన అప్పారావు, సిపిఐ మండల కార్యదర్శి ఇరవాడ దేవుడు, సిపిఎం మండల కార్యదర్శి సూరిబాబు, దర్శి సతీష తదితరులు పాల్గొన్నారు.

చింతూరు : గిరిజన ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలని కోరుతూ ఈ నెల 30న జరుగు చలో రంపచోడవరం ఐటిడిఎకు, మే 2న జరుగు మన్యం బంద్‌కు ఎపి ఆదివాసీ గిరిజన సంఘం సంపూర్ణ మద్దతు ఇస్తుందని సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు సీసం సురేష్ తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పొడియం లక్ష్మణ్, కూర సత్యనారాయణ, కారం సుబ్బారావు, పూసం రాంబాబు, మడకం పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : ఈ నెల 30లోగా ఆదివాసీ స్పెషల్ డీఎస్సీపై ప్రభుత్వం ప్రకటన చేయకుంటే మే 2న మన్యం బంద్ చేస్తామని ఆదివాసి జేఏసీ నాయకులు వంతు బాలకృష్ణ, పీసా కమిటీ మండల అధ్యక్షులు తాము సూరిబాబు తెలిపారు. మండలంలోని ముంజవరం గ్రామంలో మంగళవారం జరిగిన జేఏసీ సమావేశంలో నాయకులు బీరబోయిన రామకృష్ణ, గంపా నాగరాజు, ఇపూరి వెంకటరమణ, ఈక గాంధీ ఇతర నాయకులు పాల్గొన్నారు.



చింతూరులో మాట్లాడుతున్న సీసం సురేష్



కొయ్యూరులో మాట్లాడుతున్న అఖిలపక్ష పార్టీల నేతలు



రాజవొమ్మంగిలో నిరసన వ్యక్తం చేస్తున్న ఆదివాసీ జెఎసి నేతలు



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రత్యేక డిఎస్‌సి సాధన కమిటీ

గిరిజన ప్రత్యేక డిఎస్‌సి సాధనకు నేడు చలో కలెక్టరేట్

హుకుంపేటలో సాధన కమిటీ ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి-హుకుంపేట

మెగా డిఎస్‌సితో గిరిజన నిరుద్యోగ ఉపాధ్యాయులకు తీరని నష్టం జరుగుతుందని, ప్రత్యేక గిరిజన డిఎస్‌సి ప్రకటించి మన్యంలోని పోస్టులన్నీ గిరిజనులతో భర్తీ చేయాలని ప్రత్యేక డిఎస్‌సి సాధన కమిటీ నేతలు స్పష్టం చేశారు. ప్రత్యేక డిఎస్‌సి సాధనకు ఈనెల 30న చలో పాడేరు కలెక్టరేట్ ఆందోళనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రత్యేక డిఎస్‌సి సాధన కమిటీ నేతలు మాట్లాడుతూ, మెగా డిఎస్‌సిలో పాడేరు, పార్వతీపురం మన్యంలో 881 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనుండగా, వాటిలో గిరిజనులకు కేవలం 24 కేటాయించడం దుర్మార్గమన్నారు. అరుకులో సిఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు జిఒ 3 ప్రయోజనాలను పునరుద్ధరించి, ఏజెన్సీలోని ఉపాధ్యాయ పోస్టులన్నీ గిరిజనులతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించే వరకు నిరవధిక ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈనెల 30న బుధవారం చలో కలెక్టరేట్ ఆందోళనలో ఏజెన్సీలోని గిరిజన నిరుద్యోగులు, ఉద్యోగులు, అన్ని పార్టీల రాజకీయ నాయకులు, విద్యార్థులు ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో.హుకుంపేట వైస్ ఎంపిపి సూడిపల్లి కొండలరావు, పీసా కమిటీ ఉపాధ్యక్ష, కార్యదర్శులు చప్పలి శంకరరావు, జన్ని వెంకటరమణ, బాకూరు నేత నైని సత్తిబాబు, తడిగిరి సర్పంచ్ రంజిత్‌కుమార్, ఆదివాసీ గిరిజ సంఘం మండల కార్యదర్శి తాపుల కృష్ణారావు,గిరిజన మహిళ సంఘం జిల్లా కార్యదర్శి సొంట్యాన హైమావతి, గణేష్, అప్పల కొండ, వలసనైని లక్ష్మణరావు, మల్లేష్, సంజీవరావు, మజ్జి రామకృష్ణ ,భరత్ పాల్గొన్నారు.

నేటి చలో ఐటిడిఎకు తరలిరండి

ప్రజాశక్తి-రంపచోడవరం : ఆదివాసీల హక్కుల పరిరక్షణకు ఈనెల 30న బుధవారం జరుగు చలో రంపచోడవరం కార్యక్రమానికి గిరిజన నిరుద్యోగులు, యువత, ఆదివాసీ ప్రజా సంఘాలు, గిరిజన ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, విద్యార్థులు తరలివచ్చి జయప్రదం చేయాలని ఆదివాసీ సంఘాల కూటమి (ఎఎస్‌కె) నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, ఆదివాసీ చైతన్య వేదిక అధ్యక్షులు వెదుళ్ల లచ్చిరెడ్డి, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు తీగల బాబురావు, ఆదివాసీ ఉద్యోగ సాంస్కృతిక సంక్షేమ సంఘం నాయకులు స్థానిక విలేకర్లతో మాట్లాడారు. మెగా డిఎస్‌సిలో గిరిజనులకు అన్యాయం జరిగిన నేపథ్యంలో నిరుద్యోగ యువత ఇందులో పాల్గొవాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి ధర్నా



ఐటిడిఎ గేటు ఎదుట ధర్నాలో పాల్గొన్న ఎంఎల్ హెచ్‌పిలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: సర్వీస్ రెగ్యులరైజ్ చేయడంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలంటూ వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలోని హెల్త్ సబ్ సెంటర్లలో పనిచేస్తున్న మిడ్ లెవెల్ హెల్త్ సర్వీస్ ప్రొవైడర్లు (ఎంఎల్‌హెచ్‌పిలు) డిమాండ్ చేశారు. మంగళవారం పాడేరు ఐటిడిఎ గేటు ఎదుట ఎంఎల్‌హెచ్‌పి అల్లూరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆరేళ్లుగా ఎంఎల్‌హెచ్‌పిలు, సిహెచ్‌ఒల సర్వీస్ రెగ్యులరైజ్ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఆరేళ్లు సర్వీసు పూర్తిచేసుకున్న సిహెచ్‌ఒలను రెగ్యులర్ చేయాల్సి ఉందన్నారు. ఎన్‌ఎంహెచ్ ఉద్యోగులతో సమానంగా 23శాతం వేతన సవరణ జరగాలని, పని అధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలని, ఇపిఎఫ్‌ఒ పునరుద్ధరించాలని, క్లినిక్ అద్దె బకాయిలను వెంటనే చెల్లించాలని, నిర్దిష్టమైన జాబ్‌చార్ట్ అందించాలని, ఎఫ్ఆర్ఎస్ నుండి సిహెచ్‌ఒలకు మినహాయింపు నివ్వాలని, హెచ్ఆర్ పాలసి, ఇంక్రిమెంట్, బదిలీలు, ఎక్స్‌గ్రేషియా, పితృత్వ సెలవులు తదితర ప్రయోజనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో జిల్లాలోని 297 మంది ఎంఎల్‌హెచ్‌పి, సిహెచ్‌ఒలు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ అక్రమాలపై క్రిమినల్ కేసులు

ప్రజాశక్తి -పాడేరు: సామాజిక పింఛన్ల పంపిణీలో అక్రమాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి ఉపాధిహామీ, డిఆర్‌డిఎ, ఐసిడిఎస్, వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, మలేరియా అధికారులతో పలు అభివద్ధి కార్యాక్రమాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పింఛన్ల పంపిణీ పక్కాగా చేయాలని, మిగిలిన నిధులను తిరిగి ప్రభుత్వానికి చెల్లించాలని సూచించారు. స్త్రీ నిధి రుణాల రికవరీ వేగవంతం చేయాలన్నారు. ఉపాధి హామీ చట్టం అమలులో నిర్దేశించిన లక్ష్యాలను అధిగ మించాలని సూచించారు. మండలంలో నాలుగు వేల మందికి ఉపాధి హామీ పనులు కల్పించాలని ఆదేశించారు. మంజూరు చేసిన ఫారంపాండ్ పనులు ప్రారంభించి నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలన్నారు. జాబ్ కార్డుదారులందరికీ పని కల్పించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలను ఎంపిడిఒలు, సిడిపిఒలు తనిఖీ చేయాలన్నారు. బలహీనంగా ఉన్న చిన్నారులకు తగిన పోషకాహారం అందించి ఎదుగుదలకు చర్యలు చేపట్టాలన్నారు. బరువు తక్కువగా ఉన్న చిన్నారులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కిషోర్ బాలికా వికాస కార్యక్రమాలను సక్రమంగా అమలు చేయాలన్నారు. అంగాన్వాడీ కేంద్రాలకు మంజూరు చేసిన మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని స్పష్టం చేసారు. బాలల హక్కులు, విద్యా కార్యాక్రమాలు, సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. . సికిల్‌సెల్ ఎనీమియ పరీక్షలు నిర్వహించాలన్నారు. దోమల మందులు పిచికారీ పనులు నిర్దిష్టమైన గడుపులోగా పూర్తి చేయాలన్నారు. దోమల మందు పిచికారీ పనులుకు పంచాయతీ అధికారులు సిబ్బంది సహకారం అందించకపోతే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా పరిషత్ సిఇఒను ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా పిడి డాక్టర్ విద్యాసాగర్, డిఆర్‌డిఎ పిడి వి.మురళి, ఐసిడిఎస్ పిడి ఎన్. సూర్యలక్ష్మి, డిఎల్‌పిఒ పిఎస్.కుమార్, ఎంపిడిఒలు పాల్గొన్నారు..

నాసిరకం పనులపై విజిలెన్స్ విచారణ చేపట్టాలి

- తక్షణమే నాణ్యతాప్రమాణాలతో రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి
- సిపిఎం నాయకులు డిమాండ్

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని వడ్డిగూడెం గ్రామపంచాయతీ పరిధి విఆర్ పురం, ఆర్ అండ్ బి రోడ్డు నుండి బీసీ కాలనీ మీదుగా రేఖపల్లి ఎంపీడీవో ఆఫీస్ వరకు నాసిరకంగా జరిగిన రోడ్డు నిర్మాణ పనులపై విజిలెన్స్ అధికారులతో విచారణ చేపట్టాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వారు ఆ రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో 2023-24లో బిటి రోడ్డు మంజూరైందని చెప్పారు. చింతూరు ఐటీడీఏ ట్రైబల్ వెల్ఫేర్ కింది స్థాయి అధికారులు పర్యవేక్షణ లేకపోవడం వలన నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టర్ తన ఇష్టం వచ్చినట్లు రోడ్డు నిర్మాణ పనులు చేశారని తెలిపారు. మొదట రోడ్డు లెవెల్ చేసి నాణ్యమైన గ్రావెల్ వేసి, 15 రోజులు వాటరింగ్, రోలింగ్ చేసి, వెట్ మిక్స్ వేయాలని నిబంధనలున్నా, అవేవీ పట్టించులేదని తెలిపారు. కేవలం జెసిబి మిషనుతో రోడ్డుకు ఇరువైపులా మట్టిని ట్రెంచ్ తీసి ఆ మట్టినే రోడ్డు మధ్యలోకి, పక్కకు పోసి చదును చేసి, కనీసం ఒక్కసారి కూడా రోలింగ్ చేయకుండా, రాత్రికి రాత్రే లారీలతో వెట్ మిక్స్ మెటీరియల్ తీసుకొచ్చి అక్కడక్కడ కొంచెం కొంచెం పల్చగా పోసి స్ప్రెడింగ్ చేశారని తెలిపారు. పోసిన వెట్ మిక్స్‌పైన కూడా వాటరింగ్ చేయలేదన్నారు. రోడ్డు మొత్తం నాసిరకం మెటీరియల్‌తో తూతూ మంత్రంగా నిర్మించారని తెలిపారు. దీనిపై పలు పత్రికల్లో వార్తలు వచ్చినా ఏ అధికారీ పట్టించుకోలేదని విమర్శించారు. రోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షించాల్సిన అధికారులు కాంట్రాక్టరుకు కొమ్ముకాస్తూ రోడ్డును నాసిరకంగా నిర్మించడానికి సహకరించారని తెలిపారు. అయినా కూడా మిగిలిన పనులు ఏడాది నుండి ఆగిపోయాయన్నారు. చింతూరు ట్రైబల్ వెల్ఫేర్ అధికారులుగాని, సంబంధిత డిపార్టుమెంట్ అధికారులుగాని ఈ రోడ్డును పర్యవేక్షణ చేసిన దాఖలాలు లేవని విమర్శించారు. ఈ రోడ్డును ఎప్పటికీ పూర్తి చేస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఈ రోడ్డును ప్రభుత్వ నింబంధనల ప్రకారం నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని కోరారు. లేకుంటే ఈ రోడ్డు నిర్మాణంలో జరిగిన అవినీతిపై విశాఖపట్నం ఈఎంసి కార్యాలయం ముందు స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు సున్నం రాజులు, విఆర్ పురం ఎంపీపీ కారం లక్ష్మి, పార్టీ మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, ఎంపీటీసీ పూనెం ప్రదీప్ కుమార్, మండల కమిటీ సభ్యులు కారం సుందరయ్య, పంకు సత్తిబాబు, పోడియం శ్రీరామ్మూర్తి, గుండెపూడి లక్ష్మణరావు, సీరపు. తాతబాబు, వడ్లాది రమేష్ పాల్గొన్నారు.



నాసిరకంగా నిర్మించిన రోడ్డును పరిశీలిస్తున్న ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం జిల్లా, మండల నాయకులు

టెన్త్ ఫెయిలైన విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలో ఈ సంవత్సరం పదో తరగతి పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు ఆయా సబ్జెక్టులపై ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. టెన్త్ ఫెయిలైన విద్యార్థులకు రంపచోడవరం మండలం ముసురుమిల్లి గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగుతలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఈ సంవత్సరం టెన్త్‌లో వివిధ సబ్జెక్టులలో ఫెయిలైన విద్యార్థులకు భోజన వసతితో సహా ప్రత్యేక క్లాసులు నిర్వహించి ఆయా సబ్జెక్టులలో ఉత్తీర్ణత సాధించే విధంగా ఈ శిక్షణ ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

గిరిజన రైతులకు రుణాలు మంజూరు చేయాలి

ఏజెన్సీలోని గిరిజన రైతులకు ఈ సంవత్సరం తొలకరినాటికి వివిధ బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయాలని ఆయా బ్యాంకుల మేనేజర్లను ఐటిడిఎ పిఒ సింహాచలం ఆదేశించారు. మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బ్యాంకు అధికారులతో మాట్లాడారు. ఏజెన్సీలోని గిరిజన రైతులు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే తొలకరి పంటలకు బ్యాంకుల ద్వారా రుణాలు పొందవచ్చని చెప్పారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

ఈదురుగాలులతో భారీ వర్షం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుండి తీవ్రమైన ఎండ కాయడంతో పాటు వడగాల్పులు, ఉక్కపోతతో మన్యం వాసులు అల్లాడిపోయారు. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశంలో నల్ల మబ్బులు కొమ్ముకొని ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం సుమారు గంటసేపు కురిసింది. దీంతో ఎండ వేడిమి నుంచి మన్యవాసులు ఉపశమనం పొందారు. ఈదురుగాలులతో కురిసిన భారీ వర్షానికి విద్యుత్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

టిడిపి గ్రామ కమిటీలను నియమించాలి

ప్రజాశక్తి-రంపచోడవరం

తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీలను నియమించాలని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి పార్టీ నాయకులను ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం జరిగిన నియోజకవర్గం 11 మండలాల టిడిపి ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి రంపచోడవరం నియోజకవర్గ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, నాయకులు మఠం విజయభాస్కర్, లోతా లక్ష్మణరావు, దంతులూరి శివాజీ, 11 మండలాల అద్యక్షులు, కార్యదర్శులు, సీనియర్ నాయకులు, క్లస్టర్, యూనిట్, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మారెమ్మకు బంగారు, వెండి ఆభరణాల వితరణ

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం సీలేరు మారెమ్మ అమ్మవారికి మాల్కనిగిరి జిల్లా చిత్రకొండ గ్రామానికి చెందిన ఐరన్ సిమెంట్ వ్యాపారి మునుకోటి నాగ శ్రీనివాసరావు దంపతులు రూ.2 లక్షలు విలువైన బంగారు, వెండి ఆభరణాలు మంగళవారం ఆలయ కమిటీకి అందజేశారు. 14.1/2 గ్రాముల బంగారు నక్లిస్, 43 గ్రాముల వెండి కాసులపేరు అమ్మవారికి సమర్పించారు. అమ్మవారి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



ఆలయ కమిటీ వారికి ఆభరణాలు అందిస్తున్న నాగ శ్రీనివాసరావు దంపతులు



చింతపల్లి జూనియర్ కళాశాల ముఖద్వారంలో చెత్త కుప్పలు

పేరుకుపోయిన చెత్తతో పరేషాన్!

- జూనియర్ కాలేజీ ముఖద్వారంలో అపారిశుధ్యం
- పట్టించుకోని గ్రామ పంచాయతీ, అధికారులు

ప్రజాశక్తి- చింతపల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ముఖద్వారం వద్ద పేరుకుపోయిన చెత్త తొలగింపులో గ్రామ పంచాయతీ, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళాశాల ప్రధాన గేటును ఆనుకుని ఉన్న చెత్త కంటైనర్ పూర్తిగా నిండిపోవడంతో, బయట పడిన చెత్త కుప్పలు పక్కన పెరిగిపోతున్నాయి. చెత్తతొట్టి నుంచి రోడ్డుపై పడిన ప్లాస్టిక్ కవర్లు, ప్యాకెట్లు, ఇతర వ్యర్థాలు కుళ్లిపోవడంతో దుర్వాసన వ్యాపిస్తుంది. దీంతో విద్యార్థులు, అధ్యాపకులు, స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. చెత్త తొలగింపులో పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ కాలేజీ పరిసరాల్లో అపరిశుభ్రంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. తక్షణం స్పందించి, కాలేజీ గేటు వద్ద పేరుకుపోయిన చెత్త తొలగింపునకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



నియామకపత్రాలు అందుకున్న వారితో ఎంపీ శ్రీభరత్

నైపుణ్యాలుంటే అవకాశాలు

అమర్‌రాజా ఉద్యోగ మేళాలో ఎంపీ శ్రీభరత్

ప్రజాశక్తి-మధురవాడ : యువతకు నైపుణ్యాలుంటే అవకాశాలు వస్తాయని గీతం అధ్యక్షులు, ఎంపీ శ్రీభరత్ అన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా మంగళవారం అమర్‌రాజా సంస్థ నిర్వహించిన ఉద్యోగమేళాలో ఆయన పాల్గొని ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేశారు. పదవ తరగతి నుంచి ఇంటర్, ఐటిఐ నుంచి పాలిటెక్నిక్ అర్హత గల వారికి అమర్‌రాజా సంస్థ అవకాశాలు కల్పించడం అభినందనీయమన్నారు. యువతరం అమర్‌రాజా వంటి సంస్థలు ఇచ్చే శిక్షణ పొందడం ద్వారా అదనపు అర్హతలను సాధించాలని, తద్వారా అవకాశాలు అందిపుచ్చుకోవాలని సూచించారు.

ఈ ఉద్యోగ మేళాకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి 3 వేల మంది యువత తమ పేర్లను నమోదు చేయించుకున్నారు. ఉదయం నుంచే యువత పెద్ద ఎత్తున గీతం ప్రాంగణానికి తరలివచ్చారు. మొత్తం 1172 మందిని ఎంపిక చేసినట్లుగా అమర్‌రాజా ప్రతినిధులు తెలిపారు.

ఉద్యోగ మేళా ప్రారంభోత్సవ కార్యక్రమంలో గీతం ప్రో-వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ పాల్గొని ప్రసంగించారు. అమర్‌రాజా సంస్థ నియామకపు విభాగం సీనియర్ అధికారి కళ్యాణ్ మాట్లాడుతూ ఎంపీ ఎమ్.శ్రీభరత్ చొరవతో స్థానిక యువతకు అవకాశాలను కల్పించడానికి తమ సంస్థ ముందుకు వచ్చిందన్నారు.

రెవెన్యూ కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం వద్దు

మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ దినేష్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి పాడేరు: రెవెన్యూ కార్యక్రమాల అమలు, సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్‌కుమార్ హెచ్చరించారు. మ్యుటేషన్ ప్రక్రియ జాప్యం చేస్తే ఉపేక్షించబోమని, భూముల రీసర్వే సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి 22 మండలాల రెవెన్యూ, సర్వే అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రీసర్వేలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూ కార్యక్రమాలను పక్కాగా అమలు చేయాలన్నారు. నీటి లభ్యతున్న వ్యవసాయ భూములకు నీటి పన్నులను వసూళ్లు చేయాలని ఆదేశించారు. 26 వేల మందికి పివిటిజిలకు ఆధార్‌కార్డులు జారీ చేయాల్సి ఉందని, ఆ ప్రక్రియను వెంటనే చేపట్టాలని ఆదేశించారు. 35 వేల జనన ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాల్సి ఉందన్నారు. అదే విధంగా చిరునామా, జనన ధ్రువీకరణ, గుర్తింపు కార్డుతో కూడిన నివాస ధ్రువీకరణలను గ్రామ సచివాలయం నుంచి జారీ చేయాలన్నారు.

ప్రభుత్వ భూముల రక్షణ చర్యలు

ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై హైకోర్టు సీరియస్‌గా ఉందని, దీనిపై సర్వే చేసి రిపోర్టు సమర్పించాలన్నారు. రెవెన్యూ అధికారులు, ఎంపిడిఒలు, పంచాయతీ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి దురాక్రమణ చేసిన భూములను గుర్తించాలని ఆదేశించారు. ప్రభుత్వ భూముల రక్షణకు చర్యలు చేపట్టాలని సూచించారు. మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత జలపాతాల వద్ద పర్యాటకులను అనుమతించవద్దని స్పష్టం చేసారు. గ్రామస్తులతో విఆర్‌ఒలు, మహిళా పోలీసులు చరించి పర్యాటక జలపాతాల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.

సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజె.అభిషేక్ గౌడ, పాడేరు సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, అసిస్టెంట్ కలెక్టర్ కనల చిరంజీవి నాగ వెంకట సాహిత్, డిఆర్ఒ కె. పద్మలత, ఎస్‌డిసి ఎంవిఎస్. లోకేశ్వరరావు, సర్వే సహాయ సంచాలకులు కె. దేవేంద్రుడు, వర్చువల్‌గా రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ, 22 మండలాల తాహశీల్దారులు సర్వేయర్లు, విఆర్ఒలు పాల్గొన్నారు.

వెంకన్న ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు

ప్రజాశక్తి- అరకులోయ: వచ్చేనెల 8,9,10 తేదీల్లో అరకులోయలో నిర్వహించనున్న వెంకటేశ్వర కల్యాణోత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్, పెదలబుడు మేజర్ పంచాయతీ సర్పంచ్ పెట్టేలి దాసుబాబు, ఉత్సవ కమిటీ చైర్మన్ సివేరి బాలకృష్ణ తెలిపారు. మంగళవారం ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీలు సమావేశమై వెంకన్న కల్యాణోత్సవ ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ, మునుపెన్నడూ లేనివిధంగా వెంకటేశ్వర స్వామి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించడానికి పక్కాప్రణాళిక రూపొందించుకొని ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. అన్ని వర్గాలను సమన్వయపరుచుకుని ఉత్సవ విజయవంతానికి కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. వెంకన్న కల్యాణోత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఉత్సవాల ప్రారంభం నుంచి ముగింపు వరకు ప్రతిరోజూ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాలకుఏజెన్సీ ప్రాంత ప్రజలే కాకుండా, సమీప ఒడిశా నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున మూడు చోట్ల స్టేజీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తాగునీరు, బయోటాయిలెట్లు ఏర్పాటుచేస్తున్నామని, ఉత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసుల భద్రత కోరనున్నట్లు తెలిపారు. స్థానిక యువకులు కమిటీగా ఏర్పడి భద్రతా చర్యలు చేపడతారన్నారు. పర్యాటక కేంద్రం అరకులోయలో మూడు రోజులపాటు నిర్వహించే వెంకన్న ఉత్సవాలకు అన్ని వర్గాల ప్రజలు సహకరించి, విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వ ఉత్సవాలుగా నిర్వహించేందుకు ప్రభుత్వం, ఐటిడిఎ సహకరించాలని సర్పంచ్ దాసు బాబు కోరారు. కార్యక్రమంలో ఆలయ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఎల్‌పి. వెంకటేశ్వరరావు, నాగరాజు, కొర్ర కామేష్, పాంగి అప్పన్న, పాంగి మోహన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆలయ, ఉత్సవ కమిటీ చైర్మన్లు దాసుబాబు, బాలకృష్ణ

అక్రమ మైనింగ్ నిలుపుదల చేయాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : నాతవరం మండలం సుందరకోట ప్రాంతంలో లేటరైట్ పేరుతో బాక్సైట్‌ను అక్రమ తవ్వకాలను వెంటనే నిలుపుదల చేయాలని బిఎస్‌పి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బొట్టా నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం మాట్లాడుతూ ఈ నెల 23 అర్ధరాత్రి నుంచి అక్రమ మైనింగ్ తవ్వకాలు ప్రారంభించారని, దీని వల్ల పర్యావరణానికి హాని కలగడమే కాకుండా స్థానిక ఆదివాసీల జీవన మనుగడకే ప్రమాదం వాటిల్లే పరిస్థితి ఉందన్నారు. గతంలో లేటరైట్ పేరుతో బాక్సైట్ తవ్వుకుపోతున్నారని స్పీకర్ అయ్యన్నపాత్రుడు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారని, ఇపుడు అదేచోట జరుగుతున్న తవ్వకాలు ఎలా సక్రమమౌతాయని ప్రశ్నించారు.దీనిపై రాష్ట్రవ్యాప్త ఆందోళనతోపాటు పార్లమెంట్‌లో ఎంపీ రాంజీ గౌతమీతో సమస్య లేవనెత్తుతామన్నారు. దీనిపై న్యాయస్థానానికి వెళతామన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి మృతి

ప్రజాశక్తి -నక్కపల్లి : నక్కపల్లి జాతీయరహదారిపై వారపుసంత సమీపంలో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి అక్కడకక్కడే మృతి చెందాడు. మండలంలోని సీతంపాలెం గ్రామానికి చెందిన ట్రాక్టర్ ఓనర్ కం డ్రైవర్ ప్రసాదుల భాస్కరరావు, మడగా రమణ (శ్రీను), మేకల నాగేంద్ర ట్రాక్టర్‌పై అడ్డురోడ్డు వైపు వెళుతుండగా నక్కపల్లి వారపు సంత దాటగానే వెనుక నుంచి వస్తున్న ట్యాంకర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ముందుకు దూసుకుపోయి రోడ్డు పక్కన కూర్చున్న గొర్రెల కాపరి మామిడి సత్తిబాబుపై బోల్తా పడింది. ఈ ఘటనలో మామిడి సత్తిబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంలో ట్రాక్టర్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్రగాయాలు కాగా, విశాఖపట్నం ఆసుపత్రికి తరలించారు. వీరిలో ప్రసాదుల భాస్కరరావు పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. మండలంలోని సారిపల్లిపాలెం గ్రామానికి చెందిన గొర్రెల కాపరి మామిడి సత్తిబాబు రోడ్డుకు ఆనుకుని ఉన్న కొబ్బరి తోటలో మేకలు మేపుతూ, వచ్చి రోడ్డు పక్కన కూర్చున్నాడు. ఇంతలోనే మృత్యువు ట్రాక్టర్ రూపంలో వచ్చి కబళించడంతో ఆయన కుటుంబ సభ్యులు బోరును విలపించారు.గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాదంలో ఒక మేక కూడా మృత్యువాత పడింది.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-సబ్బవరం : మండల కేంద్రంలోని చోడవరం వెళ్లే రోడ్డులో పాత సబ్బవరం జంక్షన్ వద్ద మంగళవారం ఉదయం విశాఖ నుంచి చోడవరం వెళున్న 300సి బస్సు స్కూటరిస్టును ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... మండలంలోని మల్లునాయుడుపాలెం గ్రామానికి చెందిన సత్యవరపు శ్రీనివాసరావు (55) సబ్బవరం జోడుగుళ్ల వద్ద కిరాణా, తినుబండారాల హోల్‌సేల్ వ్యాపారం చేస్తుంటారు. ఆయన మంగళవారం స్కూటీపై సబ్బవరం నుండి చోడవరం రోడ్డులో వెళ్తూ పాత సబ్బవరం జంక్షన్ వద్ద యూటర్న్ చేస్తుండగా, ఆ సమయంలో వెనుక నుండి వస్తున్న విశాఖ- చోడవరం 300 సి బస్సు ఆయనపై నుండి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానిక ఎస్సై టి.దివ్య తెలిపారు. మృతుని కుమారుడు సంతోష్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు చెప్పారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్‌ని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

మత్స్యకారుని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని అన్నవరం సముద్ర తీరానికి మత్స్యకారుని మృతదేహం మంగళవారం చేరింది. పోలీసుల కథనం ప్రకారం... స్థానిక బోయివీధికి చెందిన మత్స్యకారుడు చింతపల్లి తాతారావు (60) జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయం ఉప్పుటేరు వద్ద సోమవారం చేపల వేటకు వెళ్లాడు. వేటాడుతున్న క్రమంలో ఉప్పుటేరుకు అనుకుని సముద్రం ఉండడంతో అలల తాకిడికి గురై సముద్రంలో కొట్టుకుపోయాడు. మృత దేహం అన్నవరం సముద్ర తీరంలో మంగళ వారం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మృతునికి భార్య, పైడమ్మ, ముగ్గురు కుమారులు పోలిరాజు, అప్పన్న, నూకరాజు, కుమార్తె నందిని ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గెడ్డ పోరంబోకు ఆక్రమణపై విచారణ

- పిజిఆర్ఎస్ ఫిర్యాదుకు రెవెన్యూ అధికారుల స్పందన

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో సుంకపూరు గ్రామం ప్రధాన రహదారిని అనుకుని అడవి రాజులబాబు గుడి వెనక భాగంలో సర్వేనెం 202లో 40 సెంట్లు భూమి చిటికెల భాస్కరరావు ఆక్రమించారంటూ జనసేన మండల అధ్యక్షులు సింగంపల్లి శ్రీనివాస్ సోమవారం నర్సీపట్నంలో జిల్లా కలెక్టర్ నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు, దీనిపై కలెక్టర్ ఆదేశాల మేరకు మండల సర్వేయర్ శ్రీనివాస్, విఆర్ఒ పెద్దన్నదొర విచారణ చేపట్టారు.

ఈ సందర్భంగా ఫిర్యాదారుడు శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో అనేకసార్లు తహసిల్దార్‌కు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వ బోరుబావిని ఆక్రమించుకుని, ఆ స్థలంలో జీడిపిక్కల ఫ్యాక్టరీ ఏర్పాట్లు చేస్తున్నారని ఫిర్యాదు చేశామన్నారు, ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పేదలకు ఇళ్ల స్థలాలకు కేటాయించాలని కోరామన్నారు, రెవెన్యూ అధికారులు నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని కోరారు.



బొమ్మలు వేస్తున్న చిన్నారులు

గ్రంథాలయంలో చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి - డుంబ్రిగుడ: వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ ఎస్ సునీత మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన దేవాలయాలు లాంటివని, విద్యార్థులు చిన్నతనం నుంచి గ్రంథాలయాలను వినియోగించడం అలవర్చుకోవాలని కోరారు. వేసవి సెలవుల్లో నిర్వహించే సమ్మర్‌క్యాంప్‌లు విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది కె.సుబ్బారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యాన చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - రాజవొమ్మంగి : ఎండలు మండుతున్న నేపథ్యంలో ప్రయాణికులు ప్రజలు దాహార్తిని తీర్చడానికి వీలుగా స్థానిక సీఐ ఎం.సన్యాసినాయుడు, ఎస్సై నరసింహమూర్తి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా పోలీసులు చలివేంద్రం ఏర్పాటు చేశారు. వందలాది మందికి మజ్జిగ, చల్లటి మంచినీరు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ ఎన్ సన్యాసినాయుడు, ఎస్ఐ నరసింహమూర్తి మాట్లాడుతూ ఎండలు మండుతున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమానికి లబ్బర్తి ఎంపీటీసీ గొల్లపూడి పెద్దిరాజు, వ్యవసాయ మార్కెటింగ్ చైర్మన్ లోతా లక్ష్మణరావు, టిడిపి జిల్లా నాయకులు దంతులూరి శివరామచంద్రరాజు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు మోర్త బుజ్జిబాబు పాల్గొన్నారు.

టిడిపి బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-కొయ్యూరు : తెలుగుదేశం పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏపీ టూరిజం డైరెక్టర్ కిల్లు వెంకట రమేష్ నాయుడు పిలుపునిచ్చారు. కొయ్యూరు మండలం మర్రివాడ గుడ్లపల్లి గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం పార్టీకి పాడేరు నియోజకవర్గం కంచుకోటగా ఉండేదని, టిడిపి హయాంలోనే ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధి చెందిందని చెప్పారు. 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఇప్పటి నుంచి ప్రతి కార్యకర్త, నాయకుడు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు గోలిసింగి సత్యనారాయణ, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహనీయుడు అంబేద్కర్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : డాక్టర్ బిఆర్. అంబేద్కర్ 134వ జయంతిని విశాఖపట్నం పోర్ట్ అథారిటీలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత పోర్ట్ పరిపాలనా భవనంలోని సాంబమూర్తి ఆడిటోరియంలో అంబేద్కర్ విగ్రహానికి పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ మహనీయుడని కొనియాడారు. ఆయన సేవలు చారిత్రాత్మకమన్నారు. పోర్టు ఎస్‌సి, ఎస్‌టి అధికారుల సంఘం అధ్యక్షులు జి.ఉమామహేశ్వరరావు, కార్యదర్శి ఎం.దేవీశ్వరరావు, ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఒ.రామలింగం, కార్యదర్శి జి.శివరామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పోర్ట్ అథారిటీ కార్యదర్శి టి.వేణుగోపాల్, డిప్యూటీ ఛైర్మన్ దుర్గేశ్‌కుమార్ దూబే, ప్రధాన విజిలెన్స్ అధికారి పి.ఎస్.ఎల్.స్వామి పాల్గొన్నారు. ఇటీవల జరిగిన పదోతరగతి పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

అభ్యంతరాలు వినిపిస్తున్నా.. మౌనమేనా ?

తెలుగు జాతి వైతాళికులను ప్రభుత్వం విస్మరించడం తగదు
ఇప్పటికైనా వారి పేర్లు చేర్చి సవరించిన జాబితాను ప్రకటించాలి
ఉత్తరాంధ్ర సాహితీవేత్తల ఇష్టాగోష్టిలో తీర్మానం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

తెలుగు జాతిని మేల్కొలిపిన వైతాళికులను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించడం పట్ల అభ్యంతరాలు వ్యక్తమమవుతున్నా.. ఇంకా మౌనం దేనికని సాహితీవేత్తలు, కవుల సమావేశంలో పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల కొందరి ప్రముఖుల జాబితాను ప్రకటించి వారి జయంతి, వర్ధంతులను జరపాలని చేసిన నిర్ణయం మంచిదే అయినా ప్రముఖ తెలుగు కవుల పేర్లు ఆ జాబితాలో లేకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా వారి పేర్లు చేర్చి సవరించిన జాబితాను ప్రకటించాలని తీర్మానం చేశారు. సోమవారం విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఉత్తరాంధ్ర కవులు, రచయితల ఇష్టాగోష్టి జరిగింది. దీనిలో పై తీర్మానాన్ని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ, సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంవిఎస్.శర్మ ప్రవేశపెట్టారు. గురజాడ, కందుకూరి, గిడుగు వంటి మహనీయుల పాత్రను తెలుగు ప్రజలు ఏనాటికీ మరచిపోరని ఈ సమావేశం పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కొందరి ప్రముఖుల జాబితాను ప్రకటించి వారి జయంతి, వర్ధంతులను జరపాలని చేసిన నిర్ణయం మంచిదేనని.. అయితే అందులో ప్రముఖ తెలుగు కవుల పేర్లు లేకపోవడం తీవ్ర అభ్యంతరకరమని ఈ సమావేశం పేర్కొంది. ఒకవేళ ప్రభుత్వం యాధృచ్ఛికంగా విస్మరిస్తే ఇప్పటికైనా ఆ తప్పును దిద్దుకుని జాబితాను తగిన రీతిలో సవరించి తెలుగు జాతి వైతాళికుల పేర్లను చేర్చి ఒక ప్రకటన చేయాలని కోరింది. ప్రస్తుత జాబితాపై అభ్యంతరాలు వస్తున్నా ఇంకా మౌనంగా ఉండడం చూస్తే మహనీయుల పేర్లను కావాలనే ప్రభుత్వం విస్మరించినట్లుగా భావించాల్సి వస్తుందని అభిప్రాయపడింది.

ఇష్టాగోష్టిలో 50 మంది ఉత్తరాంధ్ర కవులు

'ఉత్తరాంధ్ర సాహితీ వీచికలు' అన్న పేరుతో జరిగిన ఉత్తరాంధ్ర కవులు, రచయితల ఇష్టాగోష్టిలో 50 మంది కవులు, రచయితలు, సాహితీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. సాహితీ ప్రస్థానం ప్రధాన సంపాదకులు తెలకపల్లి రవి, ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు అతిథులుగా పాల్గొన్న ఈ కార్యక్రమానికి సాహితీ స్రవంతి ఉపాధ్యక్షులు చీకటి దివాకర్ అధ్యక్షత వహించారు. తెలకపల్లి రవి చర్చను ప్రారంభిస్తూ ఉత్తరాంధ్ర ప్రాంతం తెలుగు సాహిత్యంలో కీలక భూమిక పోషిస్తూ వచ్చిందని, దానిని రాబోయే కాలంలోనూ కొనసాగించాలని ఆకాంక్షించారు. అనంతరం జరిగిన చర్చలో పలువురు రచయితలు, కవులు పాల్గొని విలువైన సూచనలు చేశారు. ఎఎస్.రవిశేఖర్, ఎవిఆర్‌కె.మూర్తి, జెపి.శర్మ, పాయల మురళీకృష్ణ, కె.సంతోషం, భుజంగరావు, జి.రంగబాబు, వృద్ధుల కల్యాణ రామారావు, యు.అప్పలరాజు, పరవస్తు ఫణిశయనసూరి, కేతవరపు శ్రీనివాస్, ఉప్పాడ రాము, చెల్లూరు సాంబమూర్తి ప్రభృతులు తమ ప్రసంగాలతో చర్చలను సుసంపన్నం చేశారు.



మాట్లాడుతున్న తెలకపల్లి రవి

పెరిగిన ధరలతో..

బంగారం దుకాణాలు వెలవెల

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: నగరంలో బంగారం దుకాణాలు కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్నాయి. ఒకవైపు పెళ్లిళ్ల సీజన్, మరోవైపు అక్షయ తృతీయ వంటి ముఖ్యమైన పండగ ఉన్నప్పటికీ బంగారం కొనుగోళ్లు బాగా మందగించడంతో వ్యాపారస్తులు గగ్గోలు పెడుతున్నారు. ద్వారకానగర్, ఆశీల మెట్ట ప్రాంతాలు పెద్దపెద్ద బంగారం షాపులు ఉన్న ప్రదేశాలు అక్షయ తృతీయ వంటి అతి ముఖ్యమైన పండగ సందర్భంగా ఈ ప్రాంతంలో ఉన్న బంగారం దుకాణాలు, కొనుగోలుదారులతో రద్దీగా ఉంటాయి. అయితే ఈసారి ఆ పరిస్థితి లేదు. అలాగే పూర్ణా మార్కెట్, కురుపాం మార్కెట్, టౌన్ కొత్తరోడ్డు ప్రాంతాలలో పలు బంగారం దుకాణాలు ఉన్నాయి. అక్కడ కూడా ఇదే పరిస్థితి నెలకొంది. బుధవారం అక్షయ తృతీయ, ఇదే రోజున సింహాచలం చందనోత్సవం జరుగుతోంది. అక్షయ తృతీయ రోజున ఎంతోకొంత బంగారం కొనుగోలు చేస్తే, ఆ ఏడాది అంతా శుభం జరుగుతుంది అనేది పలువురి నమ్మకం. ఎన్నడూ లేని విధంగా ఈసారి బంగారం దుకాణాలకు

అక్షయ తృతీయ ఆశలు గల్లంతు

ఇటువంటి దుస్థితి కలగడం ఇదే మొదటిసారి అంటున్నారు. ఈ పరిస్థితికి కారణం, బంగారం ధర అనూహ్యంగా పెరగడమేనంటున్నారు. ఎన్నడూ లేని విధంగా 10 గ్రాముల మేలిమి బంగారం (24 క్యారెట్స్) ధర ఈసారి రూ.97,500గా ఉంది. ఈ లెక్కన తులం బంగారం ధర రూ.లక్షా 10 వేలు అవుతుంది. ధర ఆకాశంలో ఉండడంతో, కొనుగోలుదారులను ఆకర్షించడం కోసం పెద్దపెద్ద బంగారం దుకాణాల వారు అనేక రాయితీలు ప్రకటించారు. గ్రాము బంగారం ధరపై రూ.300 తక్కువగా ఇస్తామని ఒకరంటే, రూ.500 తగ్గించి ఇస్తామని మరొకరు ప్రకటనలు చేశారు. కొందరైతే కొనుగోలు చేసిన ఆభరణాలకు వాటిని తయారుచేసే ఛార్జీలను తగ్గించి ఇస్తామంటూ ప్రచారం చేశారు కూడా. ఇన్ని జరిగినా, అక్షయ తృతీయ ఈసారి తమను కాపాడుతుందా...? లేదా అని వ్యాపారులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న శశి సుంకర్

అత్యాధునిక పిల్లల కేన్సర్ విభాగం ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సయాన్ కేన్సర్ క్లినిక్స్, ఓమ్ని హాస్పిటల్స్ భాగస్వామ్యంతో విశాఖపట్నంలో అత్యాధునిక పిల్లల కేన్సర్ విభాగాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సయాన్ కేన్సర్ క్లినిక్స్ మేనేజింగ్ డైరెక్టర్ శశి సుంకర్, ఓమ్ని హాస్పిటల్స్ హెడ్ ఆఫ్ పీడియాట్రిక్స్ డాక్టర్ కె.రాధాకృష్ణ మాట్లాడుతూ ఈ విభాగం ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సేవలు అందిస్తుందన్నారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ప్రత్యేకించి పిల్లల కోసం రూపొందించిన మల్టీ-డిసిప్లినరీ కేన్సర్ చికిత్సా కేంద్రంగా ఇది నిలువనుందన్నారు. పిల్లల కేన్సర్ వైద్యులు, పిల్లలకు అనుకూలమైన చికిత్సా విధానాలు, మానసిక మద్దతు, పోషకాహార సేవలు అన్నీ ఒకే చోట అందుబాటులో ఇక్కడ ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సయాన్ కేన్సర్ క్లినిక్స్ ప్రతినిధులు డాక్టర్ భారతీదేవి, డాక్టర్ రాఘవేంద్ర నాయక్, డాక్టర్ వెంకట సుష్మ, డాక్టర్ గౌరి నాయుడు, డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, సుభాష్, ఓమ్ని ఆర్కే వైద్య నిపుణులు డాక్టర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సిహెచ్‌ఒల సమస్యలను పరిష్కరించాల్సిందే..

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైద్య ఆరోగ్య శాఖలో ఎన్‌హెచ్‌ఎం ద్వారా, గ్రామీణ ప్రాంతాల్లో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రెండోరోజైన మంగళవారమూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా కొనసాగింది. శిబిరాన్ని సందర్శించిన సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు పి.మణి మాట్లాడుతూ విశాఖ ఆరోగ్యశాఖలో ఎంతో కీలకమైన విధులు నిర్వహిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని అన్నారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా వేతన సవరణ చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ఎంఎస్ఎన్.ప్రజ్ఞ, కార్యదర్శి జి.సుధ మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఆరు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సిహెచ్‌ఒలను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలన్నారు. ఇపిఎఫ్‌ను పునరుద్ధరించాలని, క్లినిక్ అద్దె బకాయిలను వెంటనే చెల్లించి క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. నిర్దిష్టమైన జాబ్ చార్ట్ అందించాలని, ఎఫ్‌ఆర్ఎస్ నుండి సిహెచ్‌ఒలకు మినహాయింపునివ్వాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు జి.సుధారాణి, పి.దివ్య, బి.శ్రావణి, టి.మోషే, జస్వంత్ పాల్గొన్నారు. పబ్లిక్ సెక్టార్ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు మద్దతు తెలిపారు.

శంకరరావు అరెస్టు అన్యాయం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బిసి హక్కుల కోసం ప్రశ్నించిన కేసన శంకరరావును అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ని శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఎంవిపి.కాలనీలోని ఆయన కార్యాలయం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విశాఖపట్నం బిసి సంక్షేమ సంఘం నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. సమావేశంలో గొర్లె శ్రీనివాస నాయుడు, వైవి.వెంకటేశ్వరరావు, వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పై పవన్ వ్యాఖ్యలు దారుణం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కాంగ్రెస్ నాయకుల మీద చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని కాంగ్రెస్ విశాఖ నగర నాయకులు జగన్ మురారి అన్నారు. కాంగ్రెస్ అధిష్టానం పహల్గామ్ తీవ్రవాద దాడిని ఖండించిందని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకునే చర్యలకు పూర్తిగా సహకరిస్తామని కాంగ్రెస్ ప్రకటించినా పవన్ తెలివిలేకుండా వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. ఈ దుర్ఘటనను అడ్డు పెట్టుకుని రాజకీయం చేయడం తగదన్నారు.